# వినయం, విధేయత వెలుగులో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తమ నైతిక విలువల ఆసక్తిరమైన ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 15.05.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రే) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. ఒకవేళ ఈ ప్రపంచంలో ఎవరైనా పరిపూర్ణ మానవుడు జన్మించి ఉంటే వారు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రమే అని మేము గట్టిగా నమ్ముతాం, విశ్వసిస్తాం. ఆయనకంటే ముందుగానీ తర్వాత గానీ మరెవ్వరూ పరిపూర్ణ మానవుడిగా జన్మించ లేదు. దైవ హక్కులను నెరవేర్చడంలోనైనా మానవ హక్కులను నెరవేర్చడంలోనైనా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర వ్యక్తిత్వంలో అన్ని రకాల ఉత్తమ నైతిక విలువలు మేళవించి కనిపిస్తాయి. ఆయనకున్న అత్యున్నత నైతిక గుణాలలో వినయం, విధేయత (ఆడంబరరాహిత్యం) కూడా ఒకటి.

ఈ రోజు ఈ విషయానికి సంబంధించి నేను కొన్ని హదీసులను, హజ్రత్ అక్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి కొన్ని వాక్యాలను ప్రస్తావిస్తాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఈ ప్రపంచంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను మించిన పరిపూర్ణ మానవుని ఆదర్శం మరొకటి లేదు. అలాగే రాబోయే ప్రళయదినం వరకు మరెవ్వరూ ఉండబోరు కూడా. ఇంకా చూడండి! ఎన్నో అధికారిక అద్భుతాలు లభించినప్పటికీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లప్పుడూ దైవ విధేయతనే పాటించేవారు. ఆయన (స) పదేపదే اِنَّمَآ اَنَا بَشَرٌ مِّثْلُكُمْ అనేవారు. అనగా నేను మీ వంటి ఒక మానవ మాత్రుడననే.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు. వ్యర్థమైన గొప్పలకు మరియు అనవసరమైన అహంకారానికి, గర్వానికి దూరంగా ఉండవలెను. వినయం, విధేయతలను అలవర్చుకోవలెను. చూడండి! వాస్తవానికి అందరికంటే గొప్పవారు, గౌరవానికి అత్యంత అర్హులైన పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వినమ్రతకు, సామాన్యత్వానికి సంబంధించిన ఒక అద్భుతమైన ఉదాహరణ పవిత్ర ఖుర్ఆన్‌లోనే ఉంది. ఒక అంధుడు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి పవిత్ర ఖుర్ఆన్ నేర్చుకుంటూ ఉండే వాడని వ్రాయబడింది. ఒకరోజు ప్రవక్త గారి వద్ద మక్కా నగర ప్రముఖులు, పెద్దలు సమావేశమై ఉండగా ప్రవక్త గారు వారితో మాట్లాడటంలో నిమగ్నమై ఉన్నారు. ఆ అంధుడు వచ్చి కొద్దిసేపు నిరీక్షించి, ఆపై తిరిగి వెళ్ళిపోయాడు. ఇది ఒక సాధారణ విషయమే అయినప్పటికీ అల్లాహ్ తఆలా దీనికి సంబంధించి ఒక పూర్తి అధ్యాయాన్ని అవతరింపజేశాడు. ఆ తర్వాత పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా ఆ అంధుడి ఇంటికి వెళ్ళి, అతనిని తనతో పాటు తీసుకువచ్చి, తన పవిత్రమైన దుప్పటిపై కూర్చోబెట్టారు. అసలు విషయం ఏమిటంటే

ఎవరి హృదయాలలోనైతే దైవత్వపు గొప్పతనం ఉంటుందో వారు ఖచ్చితంగా వినమ్రులుగా, సామాన్యులుగా మారవలసిందే. ఎందుకంటే వారు సదా దేవుని భయభక్తులతో వణుకుతూ భయపడుతూ ఉంటారు.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు. ఇది పవిత్ర ఖుర్ఆన్‌లో లేదా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివరించిన ఒక సాధారణ సంఘటన మాత్రమే కాదు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారే మీ అందరికీ ఒక ఉత్తమ ఆదర్శమని ఇది మనకు నేర్పిన ఒక గొప్ప పాఠం. కావున మీకు ప్రవక్తపై నిజమైన ప్రేమ ఉందనే వాదన ఉంటే మీరు కూడా వినయం, విధేయతలో అత్యున్నత ప్రమాణాలను సాధించడానికి ప్రయత్నించండి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు. ప్రతి మనిషి తలపై రెండు గొలుసులు కట్టబడి ఉన్నాయి. ఒక గొలుసు ఆకాశం వైపునకు మరొక గొలుసు భూమి వైపునకు ఉంది. దైవదాసుడు వినయాన్ని, నమ్రతను అవలంబించినప్పుడు ఆకాశం వైపు ఉన్న గొలుసును పట్టుకున్న దేవదూత ఆ గొలుసును పైకి లాగుతాడు. అదేవిధంగా అతను అహంకారాన్ని, గర్వాన్ని ప్రదర్శించినప్పుడు భూమి వైపు ఉన్న గొలుసు అతన్ని క్రిందికి లాగేస్తుంది. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంకా ఇలా ప్రవచించారు. దైవదాసుడు వినయాన్ని అలవర్చుకున్నప్పుడు అల్లాహ్ తలా అతన్ని ఏడవ ఆకాశమంత ఎత్తుకు పెంచుతాడు.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన సొంత విషయంలో ఎలాంటి వినయపూర్వకమైన ప్రమాణాలను కలిగి ఉండేవారో దానికి సంబంధించి హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక సంఘటన ఇట్లుంది. ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త గారినుద్దేశించి ఓ మా నాయకుడా! సర్దార్ కుమారుడా! ఓ శ్రేష్ఠుడా! శ్రేష్ఠుని కుమారుడా! అని అన్నాడు. అతని మాటలు విన్న ప్రవక్త గారిట్లనిరి. ఓ ప్రజలారా! దైవభీతిని మీపై అనివార్యం చేసుకోండి, షైతాన్ మిమ్మల్ని దారి తప్పించకుండా చూసుకోండి. నేను అబ్దుల్లాహ్ కుమారుడైన ముహమ్మద్‌ను. అల్లాహ్ దాసున్ని, అతని ప్రవక్తను. అల్లాహ్ ప్రమాణంగా! అల్లాహ్ నాకు ప్రసాదించిన స్థానం కంటే మీరు నన్ను ఎక్కువగా పొగిడి మాట్లాడటాన్ని నేను అస్సలు ఇష్టపడను.

ఇలాగే పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నారు. ఎవరినీ తన స్వంత కర్మలు మాత్రమే స్వర్గంలోకి ప్రవేశింపజేయలేవు. అప్పుడు అనుచరులు ఓ అల్లాహ్ ప్రవక్త! మిమ్మల్ని కూడానా? అని అడిగారు. దానికి ప్రవక్త గారు అవును నన్ను కూడా కాదు! అల్లాహ్ నన్ను తన అనంత అనుగ్రహంతో కరుణిస్తే తప్ప అని అన్నారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లప్పుడూ ఇలా దుఆ చేసేవారు. ఓ నా అల్లాహ్! నన్ను ఒక సామాన్య స్థితిలో బ్రతికించు, ఒక సామాన్యుడిగానే నాకు మరణాన్ని ప్రసాదించు! ప్రళయదినాన నన్ను సామాన్యుల గుంపులోనే లేపు. ఒకసారి మానసిక స్థితి సరిగ్గా లేని ఒక స్త్రీ ప్రవక్త గారి వద్దకు వచ్చి ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)! నాకు మీతో ఒక పని ఉంది అని అన్నది. దానికి ప్రవక్త గారు ఓ ఫలానా వారి తల్లి! నీవు నన్ను ఏ వీధికి తీసుకువెళ్లాలనుకుంటే ఆ వీధికి తీసుకువెళ్ళు నేను నీ పని పూర్తి చేసేంతవరకు నీతోనే ఉంటానని అన్నారు.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అన్సార్ల వద్దకు వెళ్ళినప్పుడు, వారి పిల్లలకు సలాం చేసేవారు, వారి తలలపై చేతులు నిమిరి ప్రేమను కురిపించేవారు, వారి కొరకు దుఆ చేసేవారు. ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి హాజరై ఆయనతో మాట్లాడటం ప్రారంభించాడు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప వ్యక్తిత్వపు భయం కారణంగా ఆ వ్యక్తి భయంతో వణకసాగాడు. అప్పుడు ప్రవక్త గారు అతనితో ప్రశాంతంగా ఉండు, భయపడకు! నేనేమీ రాజును కాను. నేను కేవలం ఎండబెట్టిన మాంసాన్ని (సాధారణ ఆహారాన్ని) తినే ఒక సామాన్య స్త్రీ కుమారున్ని మాత్రమే అని బదులిచ్చారు. హజ్రత్ అక్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

ఇలా వ్రాశారు. అల్లాహ్ తఆలా మన పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఎంతెంతగా విజయాలు ప్రసాదిస్తూ పోయాడో ఆయన అంతకంతగా మరింత వినయాన్ని, వినమ్రతను అలవర్చుకుంటూ వెళ్ళారు.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నారు. క్రైస్తవులు మరియమ్మ కుమారుడైన యేసును పొగడటంలో హద్దులు మీరినట్లు, మీరు నన్ను పొగడటంలో అతిశయోక్తి చేయకండి. నేను కేవలం అల్లాహ్ దాసున్ని మాత్రమే. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసుడు, అతని ప్రవక్త అని మాత్రమే అనండి.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా కూడా ఉపదేశించారు. నేను యూనుస్ బిన్ మత్తా కంటే శ్రేష్ఠుడనని ఎవ్వరూ అనకూడదు. తానే అందరికంటే శ్రేష్ఠుడైనప్పటికీ తన అపారమైన వినమ్రత కారణంగా ఆయన ఆ శ్రేష్ఠతను ప్రకటించడాన్ని వారించారు. ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త గారిని ఉద్దేశించి ఓ ఖైరుల్ బరియ్యహ్! (సృష్టి మొత్తంలో అత్యంత శ్రేష్ఠుడా!) అని పిలిచినప్పుడు ప్రవక్త గారు ఆ స్థానం హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం గారిది అని బదులిచ్చారు. హుజూరె అన్వర్ ఇట్లన్నారు. నిశ్చయంగా పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారే సృష్టి మొత్తంలో అత్యంత ఉత్తమమైనవారు, ఆయనే ఖైరుల్ బరియ్యహ్ అయినప్పటికీ ఆయన తన అత్యున్నత వినయశీలతతో ఆ గౌరవాన్ని హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాంనకు ఆపాదించారు.

మక్కా విజయం తర్వాత పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం లక్ష మంది అనుచరులతో కలిసి హజ్ చేశారు. ఆ సమయంలో ఆయన వినమ్రత ఏ స్థాయిలో ఉందంటే ఆయన ఒక సాధారణ ఒంటెపై సవారీ చేస్తూ  హజ్ ప్రయాణం చేశారు. అప్పుడు ఆయన ధరించిన దుప్పటి విలువ కేవలం నాలుగు దిర్హములు లేదా అంతకంటే తక్కువగా ఉంది. హజ్రత్ అక్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు ఇలా వ్రాశారు. అహ్మద్ అనే పేరు దైవ సౌందర్యానికి ప్రతీక దానికి విరుద్ధంగా ముహమ్మద్ అనే పేరు దైవ గాంభీర్యానికి ప్రతీక. దీనికి కారణం ఏమిటంటే, 'ముహమ్మద్' అనే పేరులో దేవునికి ప్రియమైనవాడు కావడం) అనే భావముంది. అలాగే అహ్మద్ అనే పేరులో దేవునిపై అమితమైన ప్రేమను కలిగి ఉండటం అనే భావముంది. ముహమ్మద్ అనే పేరులో దాగి ఉన్న ఆ దైవ ప్రేమ అనుచరుల ద్వారా వెలుగులోకి వచ్చింది. అవమానించే వారిని, అహంకారంతో తలలు ఎత్తిన శత్రువులను దేవుని ప్రియతముడైన ప్రవక్త గారి ఆ దైవ గాంభీర్యం అణచివేసింది.

హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించిరి. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రోగులను పరామర్శించేవారు, అంత్యక్రియలకు హాజరయ్యేవారు, గాడిదపై కూడా సవారీ చేసేవారు. ఒక బానిస పిలిచినా అతని విందు ఆహ్వానాన్ని స్వీకరించేవారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజల భావాలను ఎంతగా గౌరవించేవారో, వారిని ఎంతగా ఆదరించేవారో అనడానికి ఒక అద్భుతమైన ఉదాహరణ ఇక్కడ ఉంది. ఒకసారి ఆయన ఒక కుష్టు రోగి చేతిని పట్టుకుని, తనతో పాటు ఒకే పాత్రలో (కలిసి భోజనం చేయడానికి) కూర్చోబెట్టుకున్నారు. ఆపై అతనితో అల్లాహ్ నామంతో, అతన్ని పూర్తిగా నమ్ముతూ, విశ్వసిస్తూ తిను అని అన్నారు.

ఒక ప్రయాణంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మేక మాంసం వండమని ఆదేశించారు. అప్పుడు అక్కడున్న ప్రజలు మేకను కోయడం, చర్మం వలచడం, వంట చేయడం వంటి పనులను ఎవరికి వారు బాధ్యతగా పంచుకున్నారు. దీనిపై ప్రవక్త గారు వంటకు కట్టెలు సేకరించే బాధ్యత నాది అని అన్నారు. అప్పుడు అనుచరులు ఓ అల్లాహ్ ప్రవక్త! ఆ పని చేయడానికి మేము ఉన్నాము కదా అని విన్నవించుకున్నారు. దానికి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బదులిచ్చారు. మీరు ఆ పని

చేయగలరని నాకు తెలుసు, కానీ మీ అందరిలో నేను ప్రత్యేకంగా కనిపించడాన్ని నేను ఇష్టపడను. ఎందుకంటే అల్లాహ్ తఆలా తన దాసుడు ఇతరుల కంటే భిన్నంగా, ప్రత్యేకంగా కనిపించడాన్ని అస్సలు ఇష్టపడడు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇలా ఉల్లేఖించారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటి పనులలో తమ ఇంట్లోని వారికి సహాయం చేసేవారు, నమాజ్ సమయం కాగానే నమాజ్ కొరకు వెళ్ళిపోయేవారు.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు. ఇంటి పనులను పూర్తిగా నిరాకరిస్తూ ఆ తర్వాత భార్యల నుండి ఫిర్యాదులు ఎదుర్కొనే అటువంటి పురుషులకు కూడా ఇందులో ఒక గొప్ప మార్గదర్శకత్వం ఉంది.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన చెప్పులను స్వయంగా కుట్టుకునేవారు, తన బట్టలను తానే కుట్టుకునేవారు, మీలో ఒకరు తమ ఇంట్లో ఏ విధంగానైతే పనులు చేసుకుంటారో, అదే విధంగా ఆయన కూడా తమ ఇంట్లో పనులు చేసుకునేవారు.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు. దీనిని బట్టి అనుచరులు కూడా తమ ఇళ్ళల్లో భార్యలకు సహాయం చేసేవారని తెలుస్తోంది. అయితే, ఇంటి పనుల యొక్క అసలు బాధ్యత భార్యలదేనని ఇక్కడ స్పష్టమవుతోంది.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లప్పుడూ తనకు ప్రత్యేకమైన లేదా ప్రాధాన్యత కలిగిన ప్రవర్తన లభించడాన్ని నిరాకరించారు. ఆయన మస్జిదె నబ్వీ నిర్మాణ సమయంలో ప్రజలతో కలిసి ఇటుకలు మోశారు, అలాగే కందకం తవ్వే సమయంలో మట్టిని మోశారు. ఆ సమయంలో ఎంతగా మట్టి మోశారంటే ఆ మట్టి ఆయన యదపై ఉన్న వెంట్రుకలను సైతం కప్పివేసింది. ఒక సందర్భంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విచ్చేసినప్పుడు అనుచరులు గౌరవంతో లేచి నిలబడ్డారు. అప్పుడు ఆయన పర్షియన్లు తమ పెద్దల కొరకు లేచి నిలబడినట్లు మీరు చేయకండని వారించారు.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇలా ఉపదేశించారు. పవిత్ర ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తాను విచ్చేసినప్పుడు ప్రజలు లేచి నిలబడటాన్ని వారించేవారు మరియు ఇది పర్షియన్ల ఆచారం నేనేమీ రాజును కాను అని హితబోధ చేసేవారు.

హజ్రత్ అక్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు ఇలా వ్రాశారు. నా దృష్టిలో అంతఃశుద్ధి సాధించడానికి ఇది ఒక అద్భుతమైన మార్గం. దీనికంటే మెరుగైన మార్గం మరొకటి ఉండటం అసాధ్యం. అదేమిటంటే మనిషి ఎటువంటి అహంకారాన్ని, గర్వాన్ని ప్రదర్శించకూడదు. జ్ఞానపరంగా గానీ, వంశపారపర్యంగా గానీ, ఆర్థికపరంగా గానీ...ఒక సాధారణ, నిస్సహాయ వృద్ధురాలితో కూడా మనిషి ఎప్పటివరకు అయితే ఒక ఉన్నత వంశానికి చెందిన గొప్ప హోదా గల వ్యక్తితో ప్రవర్తించే విధంగా మృదువుగా ప్రవర్తించడో, అన్ని రకాల అహంకారాలు, గర్వాలు, దర్పాల నుండి తనను తాను కాపాడుకోడో, అప్పటివరకు అతను ఎంతమాత్రం అల్లాహ్ తఆలా రాజ్యంలో ప్రవేశించలేడు.

అల్లాహ్ తలా మనకు వినయం వాస్తవికతను అర్థం చేసుకునే, పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తమ ఆదర్శాన్ని ఎల్లప్పుడూ మన ముందు ఉంచుకునే భాగ్యాన్ని ప్రసాదించుగాక. (ఆమీన్)

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔